క్లుప్తంగా

వారంలోపు డీపీఆర్‌ను సిద్ధం చేయాలి



సర్వే సిబ్బందితో చర్చిస్తున్న మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, డీఈ, ఏఈలు

రాయదుర్గంటౌన్: వారం రోజుల్లోపు డీపీఆర్‌ను సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలియజేశారు. అభివృద్ధి పనులకు సంబంధించి ఎస్‌జీఎస్ కన్సల్టెన్సీ సిబ్బంది పట్టణంలోని పైతోట వద్ద సర్వే నిర్వహించారు. సర్వేను గురువారం మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, డీఈ రవిప్రకాష్ నాయుడు, ఏఈలు ప్రతాప్, నరసింహులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు సర్వే సిబ్బందితో చర్చించారు. సర్వేను పూర్తి చేసి వారంరోజుల్లోపు డీపీఆర్ సిద్ధం చేయాలన్నారు. అనంతరం వాటర్ ట్రీట్మెంట్స్ లాబొరేటరీ కోసం నూతనంగా తెప్పించిన మిషనరీని తనిఖీ చేసి, రోజూ నాణ్యత ప్రమాణాలు పాటించాలని సిబ్బందిని ఆదేశించారు.

వేసవి క్రీడా శిక్షణ ప్రారంభం



బాస్కెట్ బాల్‌లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న కోచ్‌లు

ఉరవకొండ: స్థానిక ఎస్‌కే ప్రభుత్వ కళాశాల క్రీడా మైదానంలో జిల్లా ప్రభుత్వ స్పోర్ట్స్ అథారిటీ (డీఎస్‌ఏ) ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. శిక్షణా తరగతులను శిబిరం ప్రత్యేక కోచ్‌లు జయకృష్ణ, సురేష్, దేవిశ్రీ ప్రసాద్, ఉమర్‌లు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్ క్రీడల్లో నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ నుంచి శిక్షణకు సంబంధించి అన్ని రకాల స్పోర్ట్స్ మెటీరియల్ వినియోగించి పిల్లలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

తహసీల్దార్‌గా నరేష్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



ఉరవకొండ (వజ్రకరూరు): వజ్రకరూరు తహసీల్దార్‌గా ఎం.నరేష్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ నయాజ్ అహ్మద్ బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. డీటీగా పనిచేస్తున్న నరేష్‌కుమార్‌కు పూర్తి తహసీల్దార్ (ఎఫ్‌ఏసీ)గా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ



కుట్టుమిషన్లు అందుకుంటున్న మహిళలు

కుందుర్పి: స్థానిక కుసుమగిరి రైతు సంఘం ప్రైవేట్ లిమిటెట్ ఆధ్వర్యంలో మహిళలకు గురువారం కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. సీఈఓ నరసింహమూర్తి మాట్లాడుతూ సంస్థ పర్యవేక్షణలో 3 నెలలుగా శిక్షణ పొందిన కళ్యాణదుర్గం మండలం బట్టువానిపల్లికి చెందిన 22 మంది మహిళలకు కుట్టుమిషన్లు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది నాగభూషణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో ఫాతేహాలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారి సమాధి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో గురువారం భక్తులు దర్గాలో ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు. గురువారం స్వామి వారం కావడంతో భక్తులు స్వామి దర్శనార్థం ఆంధ్రా,కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్వామి దర్శనానికి బారులుతీరారు. దర్గా పెద్దలు ఉదయం స్వామి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలతో అలంకరించి, ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులు కందూరీలు చేశారు.

సజావుగా పింఛన్ల పంపిణీ

కూడేరు: మండల వ్యాప్తంగా గురువారం ప్రభుత్వం అందించే సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ ప్రక్రియ సజావుగా సాగింది. ఎంపీడీఓ కుళ్లాయి స్వామి పంపిణీని పర్యవేక్షించారు. 5521 మంది పింఛన్లదారులుండగా రూ.2,40,64500 మంజూరైంది.

కనెక్షన్ లేక.. కన్నీటి కష్టం!



- విద్యుత్ కనెక్షన్ల కోసం ఎదురుచూస్తున్న రైతులు
- నీరులేక పంటలు ఎండుతున్నాయని ఆందోళన
- విద్యుత్ సర్వీసుల కేటాయింపుపై కూటమి సర్కార్ నిర్లక్ష్యం
- 610 దరఖాస్తులకు నెలలుగా కనిపించని మోక్షం

జగనన్న ప్రభుత్వంలో సత్వరమే కొత్త కనెక్షన్లు..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో దరఖాస్తు చేసిన సత్వరమే విద్యుత్ కనెక్షన్ పొందే వెసులుబాటు రైతుకు దక్కేది. 2019లో అధికారంలోకి రాగానే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ కనెక్షన్లపై పరిమితిని ఎత్తేశారు.ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు, పైరవీలకు తావు లేకుండా గ్రామ సచివాలయాల్లోనే దరఖాస్తు చేసుకునేలా వెసులుబాటు కల్పించారు. విద్యుత్‌శాఖ అధికారులు రైతుల అర్హతలు పరిశీలించి, క్షేత్ర స్థాయిలో విద్యుత్ అందుబాటులో నుంచి కనెక్షన్ ఇచ్చేవారు. విద్యేత్ సర్వీసు చార్జీల్లోనూ మినహాయింపు ఇచ్చారు. ప్రస్తుత కూటమి సర్కార్‌లో ఆ విధానం ఎక్కడా కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాయదుర్గం: రైతులకు పొలాలున్నాయి.. బోరుబావుల్లో నీరు సమృద్ధిగా ఉంది.. పంటలు పండించుకోవాలన్న ఆశ ఉంది.. వ్యవసాయమే జీవనాధారంగా బతికే రైతన్నకు ఒక్కపూట పొలంవైపు వెళ్లకపోయినా దిక్కుతోచదు. అయితే పొలం వద్దకు వెళ్తే పంట సాగు చేయలేదు.. సాగు చేసిన పంటలు నిలువునా ఎండుతుంటే చూసి తల్లడిల్లుతున్నారు. బోరుబావుల ఆధారంగా పంటలు పండించుకుందామంటే విద్యుత్ కనెక్షన్లు మంజూరు కాలేదు.. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, లైన్ల కోసం డీడీల రూపంలో డబ్బులు చెల్లించి నెలలు కావొస్తున్నా ఎదురుచూడాల్సి వస్తోంది. బోర్లలో నీళ్లు పడ్డాయన్న సంతోషం కంటే విద్యుత్ కనెక్షన్ మంజూరు కాలేదన్న బాధ రైతులను వేధిస్తోంది.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉవరకొండ విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలోని 33/11 కేవీ సామర్థ్యంతో ఏర్పాటు చేసిన మొత్తం 53 విద్యుత్తు ఉప కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా 76,410 వ్యవసాయ, 1,18,364 గృహ, పరిశ్రమలకు చెందిన కనెక్షన్లు ఉన్నాయి. 2024 జూన్ 30 నాటికి రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉవరకొండ నియోజకవర్గాల్లోని 580 కొత్తగా విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశారు. ఆ తర్వాత 612 మంది కనెక్షన్ల కోసం డీడీ లు చెల్లించి నిరీక్షిస్తున్నారు. నిత్యం కార్యాలయాల చుట్టూ తిరిగి వేసారి పోతున్నారు.

ముడుపులిస్తేనే అనుమతులు

రైతుల అవసరాలను ఆసరాగా చేసుకున్న కొందరు అధికారులు..విద్యుత్ కనెక్షన్ల కోసం వచ్చే దస్త్రం.. ముందుకు కదలాలంటే ముడుపులు చెల్లించాల్సి వస్తోంది. దరఖాస్తులో రెవెన్యూ, భూగర్భ జలాలు, వ్యవసాయం, విద్యుత్‌శాఖ ఇలా క్షేత్రస్థాయి నుంచి సంతకాలు పూర్తయ్యాకే ఆఖరుకు డీడీ రూపంగా నగదు చెల్లించాలి. ఈ మధ్యలో చేతులు మారుతున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. లేదంటే అనేక కొర్రీలు పెట్టి రైతులను ఇబ్బందులు పాలు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

ఆరు నెలలుగా ఎదురుచూస్తున్నా

విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసి గత ఆరు నెలలుగా ఎదురు చూస్తున్నా. పొలంలో బోరు తవ్విస్తే సమృద్ధిగా నీరు పడింది. మోటారు, పంపు, పైపులు అన్నీ కొని సిద్ధంగా ఉంచుకున్నాను. విద్యుత్ కనెక్షన్ ఒక్కటే పెండింగ్ ఉంది. దీంతో వ్యవసాయం చేయలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. తక్షణం విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయాలి.

– గోవిందప్ప, రైతు, కలుగోడు

దరఖాస్తులన్నీ అప్‌లోడ్ చేశాం

ఉరవకొండ విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని కొత్తగా విద్యుత్ కనెక్షన్ల కోసం వచ్చిన దరఖాస్తులన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. గత ఏడాది 2024 జూన్ 30 వరకు నమోదయిన రైతులందరికీ కనెక్షన్లు మంజూరు చేశాం. ఆ తర్వాత సుమారు 610 దరఖాస్తులు వచ్చాయి. వాటికి సీనియార్టీ ప్రకారం త్వరలో ప్రభుత్వం కనెక్షన్లు మంజూరుచేసే అవకాశం ఉంది. రైతులు ఆందోళన చెందాలల్సిన అవసరం లేదు. అందరికీ కనెక్షన్లు మంజూరవుతాయి.

– రాజశేఖర్, విద్యుత్‌శాఖ ఈఈ, కళ్యాణదుర్గం



బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు



బస్సులు లేక నిర్మానుష్యంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్

బస్సు సర్వీసులు లేక ప్రయాణికుల అవస్థలు

ఉరవకొండ: అమరావతి నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ విచ్చేస్తుండడంతో కూటమి ప్రభుత్వం ఆర్టీసీ సర్వీసులను రాజధానికి తరలించింది. దీంతో ఉరవకొండ ఆర్టీసీ డిపోలో గురువారం బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. డిపో పరిధిలో మొత్తం 59 సర్వీసులు ఉంటే అందులో 20 బస్సులు అమరావతికి తరలించారు. దీంతో రాయదుర్గం గుంతకల్లు, అనంతపురం, బళ్లారి తదితర ప్రాంతాలకు వెళ్లే సర్వీసులన్నీ మోదీ సభకు తరలించారు. ప్రయాణికులకు దీని పై ఆర్టీసీ అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు ఉదయం నుంచి బస్సుల కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది. చివరకు ప్రయానికులు ఆర్టీసీ అధికారులను నిలదీయగా, తాపీగా బస్సులను అమరావతి సభకు పంపామని చెప్పడంతో ఆర్టీసీ అధికారుల తీరు పై ప్రయాణికులు మండిపడ్డారు.

కల్వర్టులపై అడ్డగోలు నిర్మాణాలు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌నుంచి టీ సర్కిల్ వరకు రోడ్డు పక్కనున్న భవనాలు, షాపులను నిబంధనల మేరకు తొలగించారు. అయితే డ్రెయినేజీ ఏర్పాటైన తర్వాత భవన యజమానులు, షాపుల యజమానులు తిరిగి వాటిపైనా నిర్మాణాలు చేపట్టారు. ఓ టీడీపీ నేత అండదండలతో పట్టణంలోని ప్రధాన రోడ్డుకు ఇరువైపులా అడ్డగోలుగా నిర్మాణాలు చేపట్టారు. దీంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. భవిష్యత్‌లోనూ డ్రెయినేజీల్లో పూడిక తీసేందుకు వీలు ఉండదని స్థానిక ప్రజలు అంటున్నారు.



గాంధీ చౌక్ సమీపంలో డ్రైనేజీపై నిర్మాణం చేపట్టిన దృశ్యం

బసవేశ్వరుడి జీవితం అందరికీ ఆదర్శం



బసవేశ్వర జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న గవిమఠం పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవ రాజేంద్రస్వామి



బసవేశ్వర జయంతి సందర్భంగా బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న గవిమఠం ఉత్తరాధికారి

ఉరవవకొండ: బసవేశ్వరుడి జీవితం అందరికీ ఆదర్శప్రాయమని గవిమఠం పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవరాజేంద్రస్వామి, మఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి పేర్కొన్నారు. గురువారం వీరశైవుల కులదైవం, విశ్వగురు జగజ్యోతి బసవేశ్వరుడి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉరవకొండ తాలుకా వీరశైవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవరాజేంద్రస్వామి, మఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవ రాజేంద్రస్వామి, రూరల్ సీఐ సయ్యద్ చిన్నగౌస్ హాజరయ్యారు. స్థానిక ఎదురు బసవన్న గుడి వద్ద నుంచి బసవ జయంతి బైక్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం వీరశైవ కళ్యాణ మంటపంలో జరిగిన సమావేశంలో గవి మఠం పీఠాధిపతులు చెన్నబసవరాజేంద్రస్వామి, ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి మాట్లాడారు. లింగాయత్ ధ్మారిక స్థాపకుడు, సాంఘిక విప్లవకారుడు, విశ్వగురు మహాత్మ బసవేశ్వర స్వామి 894వ జయంతి సందర్భంగా అందరికీ శుభకాంక్షలు తెలియజేశారు.

దేశం కోసం అందరం ఏకమవ్వాలి

పహల్గాంలో ఉగ్రవాదులు దాడులు చేయడం సరికాదని, దేశం కోసం అందరం ఏకమవ్వాలని ఉరవకొండ రూరల్ సీఐ సయ్యద్ చిన్నగౌస్ పిలుపునిచ్చారు. వీరశైవులు నిత్యం హిందూధర్మాన్ని పాటిస్తూ ఎంతో మందికి ఆదర్శంగా నిలవడం గొప్ప విషయమన్నారు. ఉగ్రవాదాన్ని అణిచివేసేంత వరకూ ప్రతి ఒక్కరూ సైనికుల్లా ఉండాలన్నారు. కార్యక్రమంలో అఖిల భారత వీరశైవ రాష్ట్ర నాయకులు పాల్తూరు శశిధర్‌గౌడ్, దేశాయి గంగాధర్, పాటిల్ నిరంజన్‌గౌడ్, చంద్రిక మల్లికార్జున, బొజ్జప్ప, జయేంద్రరెడ్డి, మఠం నందిని, కొనకొండ్ల బసవరాజుస్వామి, రాకెట్ల వీరేష్, టీచర్ లోకేష్, రేషేంద్ర తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

కణేకల్లు: మండల కేంద్రమైన కణేకల్లుకు చెందిన యువతి అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన తిప్పేస్వామి కూలి పనికెళ్లి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతని కూతురు కూడా స్థానికులతో కలిసి రోజూ కూలిపనులకెళ్తుంది. బుధవారం ఉదయం ఇంటి నుంచి పనులకెళ్లి సాయంత్రమైనా తిరిగి రాలేదు. ఇరుగుపొరుగుతోపాటు బంధువులను విచారించిన ఆచూకీ లభించలేదు. దీంతో తిప్పేస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సేవ్ ఆర్టీటీ- సేవ్ అనంతపురం



చింతర్లపల్లిలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న దృశ్యం

శెట్టూరు: మండలంలోని చింతర్లపల్లిలోని గ్రామస్తులు సేవ్ ఆర్టీటీ- సేవ్ అనంతపురం అంటూ ర్యాలీ చేశారు. అన్ని వర్గాల వారి సంక్షేమానికి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న ఆర్డీటీకి అందుతున్న నిధులను అడ్డుకోవడం సరికాదని గ్రామస్తులు అన్నారు. చింతర్లపల్లిలో గ్రామస్తులు కలిసికట్టుగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు గౌరయ్య, గౌర్రప్ప, రామలింగప్ప, రామూర్తి, మైలారి, ఆనంద్, బాలరాజు, ధనుజయ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీని కాపాడుకుందాం



ఆర్‌డీటీని కాపాడాలని నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఉరవకొండ: అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న ఆర్డీటీని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు నందు తెలిపారు. ఆర్డీటీని కాపాడుకుందామని విద్యార్థులతో కలిసిన నిరసన తెలియజేశారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాల వద్ద జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ నాయకులు మాట్లాడారు.పేదల అభ్యున్నతికి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇలాంటి సంస్థ సేవలు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సాదిక్

రాయదుర్గంటౌన్: మండలంలోని వీరాపురం మలుపు వద్ద గురువారం రాత్రి ద్విచక్రవాహన్ని ఆటో ఢీకొన్న ప్రమాదంలో తాపీ మేస్త్రీ సాదిక్ గాయపడ్డాడు. కణేకల్లుకు చెందిన సాదిక్ రాయదుర్గంలో పనిముగించుకొని సొంతూరు వెళ్తుండగా ఆటో ఢీకొనింది. అతన్ని మెరుగైన చికిత్స కోసం అనంతపురం తీసుకెళ్లారు.

యువకుడికి తీవ్ర గాయాలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని మొలకాల్మూరోడ్డు హైవే బ్రిడ్జి సమీపంలో గురువారం తెల్లవారు జామున గుర్తు తెలియని వాహనం ఢీకొని సుదీప్ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన సంజీవ కుమారుడు సుదీప్ మొలకాల్మూరు రోడ్డు నుంచి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనింది. ప్రమాదంలో సుదీప్‌కు తీవ్ర రక్తగాయాలయ్యాయి. అతన్ని మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం తీసుకెళ్లారు.

వాడవాడలా మేడే వేడుకలు



మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న కమిషనర్ వంశీ



కొర్రకోడులో కార్మికులకు సరుకులు అందజేసిన సర్పంచ్ చంద్రశేఖర్,



రాయదుర్గంలో కార్మిక దినోత్సవాన్ని జరుపుకుంటున్న దృశ్యం



జెండాను ఎగురవేస్తున్న సీఐటీయూ నాయకులు, ఆశా వర్కర్లు

కూడేరు: మండల కేంద్రంలో సీపీఐ, సీపీఎం, ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా కమిటీ సభ్యుడు పెరుగు సంగప్ప, సీపీఐ నేతలు రమణ, వెంకటేష్, మలరాయుడు, సీపీఎం మండల కార్యదర్శి కరీం, ఆటో యూనియన్ నాయకులు గోవిండ్, సూరి, మంజు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం మేడే నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట కమిషనర్ వంశీ, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు, జిల్లా కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్, శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

రాయదుర్గంటౌన్: రాయదుర్గంలో గురువారం కారిమ్మక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పాత మున్సిపల్ కార్యాలయం, స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: కార్మికులంతా ఐక్యత ఉంటూ హక్కులు కాపాడుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి తెలిపారు. గురువారం కార్మిక దినోత్సవాన్ని (మేడే) సీఐటీయూ, హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉద్దేహాళ్, దేవగిరి క్రాస్ గ్రామాల్లో జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోటేశ్వరరెడ్డి, కురుబ సంఘం అధ్యక్షుడు నాగరాజు, సీఐటీయూ నాయకులు ఓబులేసు, హనుమంతు, హమాలీ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

కూడేరు: కొర్రకోడులో గురువారం కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటనారాయణ, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలంలోని పలు గ్రామాల్లో మేడే వేడుకలు గురువారం జరుపుకున్నారు. బెళుగుప్పలో సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో రైతు సంఘం, కార్మిక, ఉపాధ్యాయ సంఘం జిల్లా, మండల నాయకులు పాల్గొని జెండాను ఎగురవేశారు. తగ్గుపర్తి, దుద్దేకుంట, అంకంపల్లి గ్రామాల్లో కార్మికులు వేడుకలు జరిపారు. కార్యక్రమంలో హమాలీ యూనియన్ మండల అధ్యక్షుడు మారెన్న, రైతు సంఘం జిల్లా నాయకులు బీహెచ్ రాయుడు, యూటీఎఫ్ జిల్లా నాయకులు ఈశ్వరయ్య, సీఐటీయూ మండల కార్యదర్శి భీమన్న, మండల సెక్రటరీ మల్లికార్జున, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడు పాతన్న, సభ్యులు చిన్న పాతన్న, మురళీ, ఓబుళేసు, వెంకటేశులు, యాట రాయుడు, ఈశ్వర్, వన్నూరస్వామి పాల్గొన్నారు.ఆవులెన్న గ్రామానికి చెందిన సర్పంచ్ రామ్‌మోహన్ గ్రామంలోని ఉపాధి హామీ కూలీతో కలసి వేడుకలు నిర్వహించారు. కూలీలతో కలిసి పనులు చేసే ఫారంపాండ్ వద్ద కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు.

ఉరవకొండ (వజ్రకరూరు): వజ్రకరూరులో గురువారం సీఐటీయూ హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి విరూపాక్షి, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బెంజిమెన్ తదితరులు హాజరయ్యారు. కమలపాడులో ఆంజనేయ హమాలీ యూనియన్, సీఐటీయూ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఓబుళపతి, సుధాకర్, మహిళా నాయకురాలు రంగమ్మ, హమాలీ సంఘం నాయకులు చంద్రశేఖర్, షెక్షావలి, ఎర్రిస్వామి, ప్రకాష్, చిన్న అంజనే యులు, మహబూబ్‌బాషా, పెద్దన్న, భీమా, వెంకటేష్, రవి, సీపీఎం నాయకులు వెంకటేష్ పాల్గొన్నారు.

కుందుర్పి: మండల కేంద్రంతో పాటు వడ్డెపాళ్యం, మలయనూరు గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, సీపీఐ, సీఐటీయూ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో గురువారం మేడే నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సీపీఐ కార్యకర్తలు రఘువీరా, నాగభూషణ, రవి, శామ్యూల్ పాల్గొన్నారు.

శెట్టూరు: మండలం కేంద్రంలో అంగన్‌వాడీ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం మే డే వేడుకలు నిర్వహించారు. మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతలమ్మ, సిబ్బందితో కలిసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు అపర్ణ, ద్రాక్షాయని, యూనియన్ సభ్యులు జానికి, విశాల, భీమక్క, సరస్వతి, కుముద, నాగమణి, శారద పాల్గొన్నారు.



ఆవులెన్న వద్ద మేడే వేడుకల్లో కేకును కత్తిరిస్తున్న ఉపాధిహామీ కూలీలు



బెళుగుప్ప సీఐటీయూ కార్యాలయం వద్ద వేడుకలు నిర్వహిస్తున్న యూటీఎఫ్ జిల్లా నాయకుడు ఈశ్వరయ్య



కూడేరులో జెండా ఆవిష్కరిస్తున్న వ్యకాసం జిల్లా కమిటీ సభ్యుడు సంగప్ప



వజ్రకరూరులో జెండా ఆవిష్కరిస్తున్న సీపీఎం మండల కార్యదర్శి విరూపాక్షి, నాయకులు



శెట్టూరులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతలమ్మ